పేదల బతుకుల్లో వెలుగులే లక్ష్యం

- ఆ దిశగానే సీఎం జగన్ పాలన
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: సమాజంలోని పేదలందరి బతుకుల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పెరిగిన రూ.3 వేల వైఎస్సార్ పింఛన్ కానుకను పద్మనాభం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన పింఛన్‌దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు బడాబాబుల సంక్షేమం కోసమే పని చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో పార్టీలతో సంబంధం లేకండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసుల మేరకు పింఛన్లు ఇచ్చేవారన్నారు. చంద్రబాబు పాలనలో 29 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా... వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 68 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నట్టు తెలిపారు. పద్మనాభం మండలంలో ఇంత వరకు 8,036 మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. కొత్తగా 112 మందికి మంజూరు చేసినట్టు తెలిపారు. వీరికి నెలకు 2,34,62,000 ఇస్తున్నట్టు చెప్పారు. ఎకరమున్నర భూమి సాగు చేస్తే ఏడాదికి ప్రకృతి అనుకూలిస్తే రూ.36 వేలు ఫలసాయం రావడం కష్టమన్నారు. పింఛన్‌దారులకు ఏడాదికి రూ.36వేలు వస్తుందన్నారు. పద్మనాభం మండలంలో నాలుగు వేల మందికి, భీమునిపట్నం నియోజకవర్గంలో 30 వేల మందికి కాలనీ ఇళ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. భోగాపురానికి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు రావడంతోపాటు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం నుంచే పరిపాలన సాగించనున్నందున భవిష్యత్‌లో భూముల విలువ పెరుగుతుందన్నారు. ఎవరూ భూములు అమ్ముకోవద్దన్నారు. భూములు అమ్మిన వారు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పద్మనాభం వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, తహసీల్దార్ కె.వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, అముజూరి అప్పారావు, ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, బేపల గురునాయుడు, చందక శ్రీను, మామిడి శివ రామకృష్ణ, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల భరోసా

భీమునిపట్నం: దేశంలో మరెక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే అర్హులందరికీ అత్యధికంగా పింఛన్లు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మత్స్యకారులు నివసించే ఎగువపేట ప్రాంతంలో వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా లబ్ధిదారులకు బుధవారం పింఛన్ల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్హత వున్నా పింఛన్లు మంజూరు చేసేవారు కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా పింఛన్ నగదు పెంచడంతో ప్రస్తుతం రూ.3 వేలు ఇస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత మేలు జరుగుతుందన్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ఏమీ ఫలించవన్నారు. తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇక్కడి వేదిక పునర్నిర్మాణానికి రూ.19.80 లక్షలతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. 3వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, కదిరి ఎల్లాజీ, ఎ.సూర్యప్రకాశ్, ముక్తి కృష్ణ, గొరపల్లి సన్యాసిరావు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, అధికారులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు



భార్య సత్యవతి, తాను కలిసి నివసిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.2750 ఉన్న పింఛన్‌ను రూ.3వేలకు పెంచారు. దీని వల్ల తనలాంటి వృద్ధులకు ఎంతో మేలు జరిగింది. రూ.3వేలు తమ ఇంటి ఖర్చులకు సరిపోతాయి. ఇటీవల తనకు యూరిన్ బంద్ అయింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో సర్జరీ చేయించుకున్నా. ఇందుకోసం ఖర్చయిన రూ.40 వేలు ప్రభుత్వమే చెల్లించింది.

– వి.సీతారామయ్య, ఏనుగులపాలెం

మా పెద్ద కొడుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి



తన భర్త మృతి చెంది ఆరేళ్లు అయింది. ఒంటరిగా జీవిస్తున్న నేను వృద్ధాప్యం కారణంగా ఏ పనీ చేయలేక ఇంటిలోనే ఉంటున్నా. తన పెద్ద కొడుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పింఛన్ నగదుతో జీవితం గడుపుతున్నా. పింఛన్ మొత్తం రూ.3 వేలకు పెంచి తనలాంటి వారిని ఎంతో మందిని జగన్ బాబు ఆదుకుంటున్నారు. మేమంతా రుణపడి వుంటాం.

– బి.అప్పడు, మద్ది

విలువైన ఆర్థిక సాయం అందుతోంది



పేదరికంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్న నాకు పింఛన్ నగదు రూపంలో ఎంతో విలువైన సాయం అందుతోంది. ప్రతి సంవత్సరం పింఛన్ సొమ్ము పెంచడంతో ఇప్పుడు రూ.3వేలు అందుతోంది. మాలాంటి వారికి ఈ నగదు ఎంతో భరోసా ఇస్తుంది.

– నొల్లి ముత్యాలమ్మ, భీమిలి


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


ఎగువపేట వేదిక పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు

క్లుప్తంగా

రూ.40 లక్షలతో మౌలిక సౌకర్యాలు


మారికవలసలో ఏర్పాటు చేసిన బోరు

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శ్మశానవాటికలో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న షెడ్లు, చేతి పంపు బోరు బుధవారం ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి ఇక్కడి సమస్యలు తీసుకెళ్లారు. దీంతో శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు యాదవ్, చిన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షిస్తున్న కళాకృతులు



లా కాలేజీ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సింహం కళాకృతులు

కొమ్మాది: నగర సుందరీకరణలో భాగంగా తీర ప్రాంతాలతోపాటు జాతీయ రహదారుల ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న కళాకృతులు ప్రయాణికులను, పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఎండాడ జాతీయ రహదారి కూడలి, కొమ్మాది ప్రధాన జంక్షన్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన కళాకృతులతో పాటు ఎండాడ లా కాలేజీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సింహాల కళాకృతులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

నేటి నుంచి పాలిపెస్ట్

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి పాలిపెస్ట్ 2కె24 నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ ఎల్.మహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ పెస్ట్‌లో కంప్యూటర్స్, సీఈసీ, ట్రిపుల్ ఈ, మెకానికల్, సివిల్ విభాగాలకు చెందిన విద్యార్థులు 180 ప్రాజెక్టులు తయారు చేశారని, వాటిని ప్రదర్శనలో ఉంచుతామని చెప్పారు. ఈ నెల 10 వరకు నిర్వహించే ప్రదర్శనలను ఆసక్తి గల వారంతా తిలకించవచ్చని తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అకడమిక్ కో – ఆర్డినేటర్ అమరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నవజీవన్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్యామ్ థామస్

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని దొరతోట వద్దనున్న నవజీవన్ పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం వీరిని కరస్పాండెంట్ హెలెన్ జాన్సన్, ప్రిన్సిపాల్ లియా ఎలిజబెత్, పీఈటీ సురేష్ అభినందించారు.

అనధికార నిర్మాణం తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ సర్వే నంబరు 5/16 గ్రామ కంఠం భూమిలో అనుమతులు లేకుండా చేపట్టిన ఓ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు మిగులు భూమిని ఆక్రమించడంతో ఏసీపీ శాస్త్రి ఆదేశాల మేరకు తొలగించినట్లు సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తెలిపారు.

సావిత్రి బాయి పూలేకి ఘన నివాళి

మధురవాడ: భారతదేశంలో స్త్రీ విద్యను ప్రారంభించిన మహా మనిషి సావిత్రి బాయి పూలే అని పలువురు కొనియాడారు. బుధవారం ఆమె జయంతిని భీమిలి డైట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలు కొనియాడారు. అణచివేతకు గురైన మహిళల హక్కుల కోసం పోరాడారన్నారు. బాలికల విద్య కోసం అనేక పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అధ్యాపకులు ఎస్.త్రినాథరావు, పి.హరిణి, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి పాల్గొన్నారు.


సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వైద్య ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

పీఎం పాలెం : నేషనల్ హెల్త్ మిషన్ వైద్య ఉద్యోగుల మధురవాడ యూనిట్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రశాంతి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్ఎమ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు వి.వీరబ్రహ్మం, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి ప్రశాంతి, తదితరులు

శాశ్వత భూహక్కు పత్రాలతో మేలు


మహిళా రైతుకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం కింద అందజేస్తున్న శాశ్వత భూ హక్కు పత్రాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద విలాస్కాన్‌పాలెం పంచాయతీ తిమ్మాపురానికి చెందిన 115 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు బుధవారం ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములకు సర్వే చేయకపోవడం వల్ల హక్కులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీ సర్వే చేయించి రైతులకు భూ హక్కు పత్రాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఇటీవల చిన్నాపురానికి చెందిన 80 ఎకరాల ఎల్లవర్ భూములకు సర్వే చేసి 100 మందికి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

అందరూ హిందూ ధర్మాన్ని ఆచరించాలి

తగరపువలస: శ్రీరాముని మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రవచకులు శ్రీరామకృష్ణ ఆనంద్ అన్నారు. చిట్టివలస రామాలయం నుంచి ఆంధ్రా బ్యాంకు మీదుగా శ్రీరాముని జీవిత చరిత్ర తెలుపుతూ బుధవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రవచకులు శ్రీరామకృష్ణ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి మానవుడు హిందూ ధర్మాన్ని ఆచరించాలని, హిందువులు అందరూ ఐక్యంగా ఉండి భక్తిభావాన్ని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, కొప్పల రమేష్, తమ్మిన రాము, నాగరాజు, గాడు వెంకటనారాయణ, కంటుబుక్త రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి మధురవాడ, హిల్ నంబర్ - 1 ఫీడర్లలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మధురవాడ మెయిన్ రోడ్డు, భగవాన్‌దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయి ప్రియ లే అవుట్, చంద్రంపాలెం, భాస్కర్‌నగర్, సంపత్‌నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, అయోధ్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, మానం ఆంజనేయులు కాలనీ, సాక్షి పేపర్ ప్రెస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

మధురవాడ: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గణేష్‌నగర్ ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలు బుధవారం ఆయన పరిశీలించారు. సరకుల నాణ్యతపై ఆరా తీశారు. తర్వాత విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి మధ్యాహ్న భోజనం నాణ్యత, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన కిట్‌లు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఇవన్నీ ఇస్తున్నది ఎవరో తెలుసా అని అడగ్గానే... జగన్ మామయ్య అంటూ విద్యార్థులు ఆనందంతో సమాధానమిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, గాదే రోశిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రభాకరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ కూన రమణ, జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు తదితరులు పాల్గొన్నారు.


గణేష్‌నగర్ యూపీ స్కూల్‌లో వంటలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో సంపూర్ణ వైద్య సేవలు


గణేష్‌నగర్ శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


సురక్ష శిబిరానికి తరలివస్తున్న వృద్ధురాలు

భీమునిపట్నం: పేదలందరికీ వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డు తోటవీధి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సరిగ్గా వైద్య సేవలు అందక ప్రజలంతా ఎన్నో కష్టాలు పడేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ప్రత్యేక శ్రద్ధతో అన్ని ప్రాంతాల్లోనూ శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారన్నారు. నిపుణులైన వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారని, అవసరమైతే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచడంతో ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా దొరక సన్యాసమ్మ మాట్లాడుతూ తనకు ఉచితంగా రూ.50 వేలు విలువ చేసే శస్త్రచికిత్స ఏవిధంగా చేశారో వివరించారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో జీవన ప్రమాణాలు మెరుగు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఆరోగ్యశ్రీ వంటి వాటి వల్ల ప్రజల జీవన ప్రమాణాలతోపాటు ఆయుష్షు కూడా పెరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్ర నగర్ యూపీహెచ్‌సీ పరిధి గణేష్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష – 2 ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజారోగ్య ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత సుమారు వెయ్యి నుంచి 3200 రకాల జబ్బులకు చికిత్స ఉచితంగా అందించేలా మార్పులు చేశారన్నారు. రూ.25 లక్షల వరకూ పరిమితి పెంచారన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లోనూ వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 7 రకాల పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు కూడా అందిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేసి వైద్యులను సత్కరించారు. జెడ్పీ కనక మహాలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు మానస, ప్రశాంతి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, కల్చరల్ వింగ్ రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, నాయకులు పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, పెండ్ర అప్పన్న, బంగారు ప్రకాశ్, బి.పాపారావు, బాబ్జి, రజని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


తోటవీధిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు నేడు

మధురవాడ: 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా ధర్మపురి కాలనీ, మారికవలసలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. మిథిలాపురి వుడా కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురు రోడ్డులోని 51వ నంబరు సచివాలయం ధర్మపురి కాలనీలో, మారికవలస ఆర్‌జీకే కాలనీ యూపీహెచ్‌సీ పరిధి మారికవలస గ్రామం 35వ నంబరు సచివాలయ పరిధిలో శిబిరాలు నిర్వహించనున్నారు. వీటిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారు. నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందిస్తారని యూపీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. ఈ శిబిరాలకు హాజరై వైద్య సేవలు అంతా సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

పెందుర్తి: అయ్యప్ప జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు జరిపారు. ముందుగా గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.